క్లుప్తంగా

అలంపూర్ మున్సిపల్ కమిషనర్‌గా శంకర్



అలంపూర్: అలంపూర్ మున్సిపల్ కమిషనర్‌గా ఎస్ శంకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కమిషనర్ శ్రీరాములు మక్తల్‌కు బదిలీపై వెళ్లారు. మక్తల్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్.శంకర్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది మున్సిపల్ కమిషనర్‌కు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.

నేటి నుంచి పనుల జాతర ప్రారంభం

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం నుంచి ప్రభుత్వ ఆదేశానుసారం పనుల జాతర కార్యక్రమం ప్రారంభిస్తున్నామని ఎంపీడీఓ రాఘవ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని చంద్రశేఖర్‌నగర్ గ్రామంలో ఎమ్మెల్యే విజేయుడు ప్రారంభిస్తారని తెలిపారు.

కేటీదొడ్డి: రాష్ట్ర ప్రభుత్వం పల్లెల్లో పనుల జాతర కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎంపీడీఓ రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ 22న కేటీదొడ్డి, మైలగడ్డ గ్రామంలోని పనుల జాతర -2025 కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరై ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఇటిక్యాల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల జాతర-2025 లో ఉమ్మడి మండలంలో గ్రామ పంచాయతీలో కొత్త పనులు ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

గద్వాల: ప్రతిపౌరుడు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీగల్ ఏయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫీసులో చట్టాలపై అవగాహన కల్పించారు.

వార్డుల సంఖ్య పెంచాలి



అయిజ: మున్సిపాలిటీలో వార్డుల సంఖ్య 20 నుంచి 30కి పెంచాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్ రెడ్డి, నాయకులు లక్ష్మణ్ గౌడ్, రఘు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజోళి: మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో శుక్రవారం అంతరాయం ఉంటుదని విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ శాంతినగర్-2 ఫీడర్ కింద లైన్లకు ఇబ్బందికరంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించేందుకు పనులు చేస్తున్నట్లు తెలిపారు. రాజోళిలోని 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో మెయింటనెన్స్ కోసం లైన్ క్లియర్ తీసుకుంటామని, దీని వల్ల మధ్యాహ్నం 2 గంటల నుంచి 5గంటల వరకు రాజోళి, తూర్పు గార్లపాడు, పడమటి గార్లపాడు, తుమ్మలపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బైక్ అదుపు తప్పి తండ్రికొడుకుకు గాయాలు

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పడంతో తండ్రికొడుకులకు గాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. బోరవెల్లికి చెందిన కేశవులు, పద్మ దంపతులు బాలుడు గగన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వడ్డేపల్లి మండలంలోని రామాపురంలో ఫంక్షన్ వెళ్లి వస్తున్నారు. ఉండవెల్లి శివారులోని రహదారిపై అదుపు తప్పి కిందపడ్డారు. దీంతో గగన్‌కు తీవ్ర గాయాలు కాగా, కేశవులకు స్వల్పగాయాలయ్యాయి. 108లో బాలుడిని కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

అనుమతి తప్పనిసరి

ఇటిక్యాల: మండలంలోని ఆయా గ్రామాల్లో గణపతి పండుగ సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసే కమిటీ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి అనుమతి తీసుకోవాలని గురువారం ఇటిక్యాల ఎస్‌ఐ రవినాయక్ సూచించారు. పోలీస్‌శాఖ విడుదల చేసిన లింక్ ద్వారా తమ కమిటీ వివరాలను ఆన్‌లైన్‌లో తప్పకుండా నమోదు చేసుకోవాలన్నారు. మండపాల దగ్గర డీజేలకు ఎలాంటి అనుమతి లేదని, విద్యుత్ శాఖ నుంచి కరెంట్ కోసం అనుమతి తీసుకొని మీసేవ ద్వారా బిల్లులు చెల్లించాలన్నారు. శాంతియుతంగా పండుగను, చివరిరోజు నిమజ్జనం ర్యాలీ నిర్వహించాలని పేర్కొన్నారు.

పారిశుద్ధ్యంపై పట్టింపేది?



ఎర్రవల్లిలో చెరువును తలపిస్తున్న వర్షపునీరు

- పల్లెల్లో కరువైన పరిశుభ్రత
- విచ్చలవిడిగా పారుతున్న మురుగు
- చెరువులను తలపిస్తున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ఎర్రవల్లి: 15 రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాల వల్ల గ్రామాల్లో ఇళ్ల మధ్యన, పరిసర ప్రాంతాల్లో మురుగు కుంటలు ఏర్పడ్డాయి. ఆయా గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు నిలిచిన నీరు, మిషన్ భగీరథ పైప్‌ల లీకేజీల కారణంగా కలిసిపోతోంది. దోమలు, ఈగలకు నివాసాలుగా మారాయి. దీనికి తోడు ఆయా కాలనీలలో రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, కంపచెట్లు ఏపుగా పెరిగాయి.

గ్రామాల్లో కరువైన పరిశుభ్రత..

ఉమ్మడి ఇటిక్యాల మండలంలో ఎర్రవల్లి, బీచుపల్లి, ఇటిక్యాల, పుటాన్‌దొడ్డి, యాక్తాపురం, సాసనూలు, దువాసిపల్లి, కారుపాకుల, గార్లపాడు, ధర్మవరం, వల్లూరు, వేముల, చాగాపురం, షాబాద్, ఉదండాపురం, సాతర్ల, పెద్దదిన్నె, కొండేరు గ్రామాలతో పాటు తదితర గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది. గతంలో పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పలు కార్యక్రమాలు నిర్వహించినా సమస్యలు తీరలేదు. ఆయా గ్రామాలలో మురుగు రోడ్లపై పారుతోంది. స్థానిక ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగియడంతో గ్రామాల్లో అక్కడక్కడ డ్రెయినేజీలు కార్మికులు సక్రమంగా శుభ్రం చేయడంలేదు. దీంతో దోమలు అధికంగా వ్యాప్తి చెంది అనారోగ్యం బారిన పడుతున్నారు.



ఇళ్ల చుట్టూ పారుతున్న మురుగు

ఫాగింగ్, బ్లీచింగ్‌ల జాడేలేదు..

కాలనీల్లో మురుగు ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్‌ను చల్లకపోవడంతో ఈగలు, దోమల వ్యాప్తి పెరిగింది. పలు కాలనీల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. కాలనీల్లో ఫాగింగ్ మిషన్ వినియోగించకపోవడంతో దోమలు, ఈగలు మరింత ఉధృతమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పారిశుద్ధ్యంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటి ముందు చెరువును తలపిస్తోంది..



కొన్ని రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు మా ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు కుంటలుగా ఏర్పడి చెరువును తలపిస్తోంది. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల చుట్టు పక్కల కాలనీల నుంచి మురుగు అందులోకి వచ్చి చేరుతోంది. దీంతో దుర్వాసన వస్తోంది. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. – సత్యనారాయణ, ఎర్రవల్లి

దోమలతో సతమతం...



మండల కేంద్రంలోని షేకుపల్లి రోడ్డులో డ్రెయినేజీ సమస్య వల్ల నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. వర్షపు నీరు, మురుగు రోడ్లపై పారుతోంది. మురుగు, మిషన్ భగీరథ నీరు కుంటలుగా ఏర్పడటంతో నిత్యం పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పారిశుద్ధ్య సమస్య పరిష్కరించాలి. – తెలుగు వీరేష్, ఎర్రవల్లి

నివారణ చర్యలు చేపడుతున్నాం..



గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిత్యం కార్యదర్శులకు సూచిస్తున్నాం. దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాలకు బదులుగా ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాం. పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే కార్యదర్శులపై చర్యలు తీసుకుంటాం. – మహ్మద్ అబ్దుల్ సయ్యద్‌ఖాన్, ఎంపీడీఓ

ప్రీప్రైమరీ సెక్షన్ ప్రారంభం



ఉలిగేపల్లిలో ప్రీప్రైమరీ సెక్షన్ ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్

మల్దకల్: మండలంలోని ఉలిగేపల్లి, నాగర్‌దొడ్డి గ్రామాలలో ప్రభుత్వం నూతనంగా ప్రీప్రైమరీ సెక్షన్‌ను మంజూరు చేసినట్లు ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ తెలిపారు. అందులో భాగంగా గురువారం ఉలిగేపల్లి గ్రామంలో ప్రీప్రైమరీ సెక్షన్‌ను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 1వ తరగతి కంటే ముందు చిన్నారులకు విద్యను అందించేందుకే ప్రభుత్వం ఈ నూతన విద్యావిధానం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. మొదటి రోజు పాఠశాలకు విద్యార్థులు రావడంతో తరగతులు ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శాంతన్న, ఉపాధ్యాయులు నాగరాజు, గంగాధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చేస్తాం

అయిజ: రైతులకు యూరియా కొరత లేకుండా చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడారు. ప్రస్తుతం యూరియా రైతులకు సరిపడినంత లేదని, దానికి ప్రత్యామ్నాయంగా నానో యూరియాతో పాటు నానో డీఏపీని వాడాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జనార్దన్, పీఏసీఎస్ సీఈఓ మల్లేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



ఎర్రవల్లిలో కృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఎర్రవల్లి: మండల కేంద్రంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి జన్మాష్టమి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఎర్రవల్లి కూడలిలో కృష్ణుడి విగ్రహానికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సాయంత్రం కృష్ణుడిని పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో బీచుపల్లి, మన్నెమ్మ, పావని, భాగ్యమ్మ, నందకిశోర్, పరుశరాముడు, వెంకటేష్ ఉన్నారు.

శివుడికి పంచామృతాభిషేకం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్పస్వామి ఆలయంలో ఉమామహేశ్వర స్వామి ఆలయంలో శివుడికి మహిళా భక్త బృందం వారు పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, అర్చకులు ఆంజనేయ శర్మ, సుక్లా ఉన్నారు.

ప్రభుత్వానికి గుణపాఠం చెబుతాం



అయిజ: విద్యారంగాన్ని బలోపేతం చేయకుంటే రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాష అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమల్లో విఫలమైందన్నారు. కార్యక్రమంలో సూర్య, అరవింద్, క్రాంతికుమార్, తిరుమలేష్, వంశీ, శ్రీనివాస్, విజయ్ పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

అయిజ: మండల కేంద్రంలోని శ్రీకృష్ణవేణి పాఠశాల విద్యార్థిని చరణ్‌తేజ్‌ను ఉపాధ్యాయుడు వీపుపై వాతలు పడేలా చితకబాదడంతో విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. పాఠశాల అనుమతి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోకపోవడంతో ఎంఈఓ పాఠశాల యజమాని మధుసూదన్‌రెడ్డికి నోటీసు జారీ చేశారు. ఉపాధ్యాయుడిపై ఎందుకు చర్య తీసుకోలేదో చెప్పాలని నోటీసులో పేర్కొన్నారు.

తక్కశిలలో మెడికల్ క్యాంపు



ఉండవెల్లి: మండలంలోని తక్కశిలలో క్యాతూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎంపీహెచ్‌ఏ నాగశేషయ్య ప్రజలకు దగ్గు, జలుబు, బీపీ, షుగర్, తదితర పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు నర్సమ్మ, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



అలంపూర్: సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీని ఎమ్మెల్యే విజయుడు గురువారం బాధితులకు అందజేశారు. ఎర్రవల్లి మండలం వల్లూరు గ్రామానికి చెందిన నాగలక్ష్మమ్మ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. సీఎం సహాయ నిధి ద్వారా ఆపరేషన్ కోసం రూ.2లక్షల ఎల్‌ఓసీ మంజూరైనట్లు తెలిపారు. వారితో పాటు నాయకులు, తదితరులు ఉన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

మానవపాడు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్త పెన్షన్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో విద్యాశాఖ అధికారి ఎంఈఓ శివప్రసాద్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధాన కార్యదర్శి షాలం, లక్ష్మన్న, రిహత్‌భాషా, శ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్, సూర్యబాబు, హరిప్రసాద్, గిరిజాబాయి, సునంద, స్వరూపరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ‘తుమ్మిళ్ల’ ఇసుక

రాజోళి: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు తుమ్మిళ్ల నుంచి ఇసుకను అందించనున్నారు. తుమ్మిళ్లలోని తుంగభద్ర నదిలో ఇసుక తీసే కాంట్రాక్ట్ సంస్థకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఫ్లెడ్జింగ్ ద్వారా ఇసుక తీసేందుకు గత నెలలో తుమ్మిళ్లలో అనుమతులు వచ్చాయి. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ఇసుక లేక ఇబ్బందులు పడుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రస్తుతం జిల్లాలో నిర్మాణంలో ఉన్న 2వేల ఇళ్లకు ఇసుకను సరఫరా చేసేందుకు ప్రత్యేక రీచ్‌ను ఏర్పాటు చేసి, దాని ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి టిప్పర్ల ద్వారా ఇసుకను అందించనున్నారు. అధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను అందుబాటులో ఉంచుతున్నామని, ఇందిరమ్మ లబ్ధిదారులు ఇసుకను ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుని కట్టడాలు ప్రారంభించుకోవచ్చని తెలిపారు. వర్షాలు ఉన్నప్పటికీ ఇసుకను అందిస్తామని కాంట్రాక్ట్ సంస్థ నిర్వాహకుడు ప్రసాద్ తెలిపారు.

చిరంజీవి జన్మదిన వేడుకలకు అభిమానులు

గద్వాలన్యూటౌన్: ప్రముఖ సినీహీరో చిరంజీవి 70వ జన్మదిన వేడుకలకు ఆయన అభిమానులు హైదరాబాద్ బయలేదేరారు. గురువారం స్థానిక రాజీవ్ సర్కిల్ నుంచి మెగా ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు బోయ జమ్మన్న ఆధ్వర్యంలో అభిమానులు బయలేదేరిన బస్సును మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మెగా ఫ్యాన్స్ జిల్లా ఉపాధ్యక్షుడు రఘు, ప్రధాన కార్యదర్శి గంజిపేట పరుశ, వేణు, శివ, అనిల్, రంగస్వామి ఉన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి



మార్లబీడు పాఠశాలలో వంట ఏజెన్సీ మహిళలతో మాట్లాడుతున్న అధికారులు



వంటలు తనిఖీ చేస్తున్న కమిషనర్ రాజయ్య

ధరూరు: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా, రుచిగా ఉండాలని ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. గురువారం మండలంలోని మార్లబీడు గ్రామంలోని పాఠశాలను ఎంపీడీఓ మంజులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వంట ఏజెన్సీ మహిళలతో మాట్లాడారు. వంట చేసే పాత్రలు శుభ్రంగా కడిగి వండాలన్నారు. మెనూ ప్రకారం వంటలు చేయాలని సూచించారు. విద్యార్థులకు వారంలో మూడు రోజులు కోడిగుడ్లు ఇవ్వాలన్నారు. టాయిలెట్స్ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రైస్‌స్టాక్, రికార్డులను పరిశీలించారు.

గట్టు: పాఠశాలకు వచ్చే విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ నల్లారెడ్డి సూచించారు. నల్లగట్టుతండా ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ సందర్శించారు. విద్యార్థులు హాజరు, పాఠశాల రికార్డులను పరిశీలించారు.

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీపీఎస్ వడ్డేపల్లి, రవీంద్ర ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని నగర కమిషనర్ రాజయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాల, స్టోర్ రూములోని కూరగాయలు, వంట సామగ్రి, వంటలను ఆయన పరిశీలించారు. మెనూ ప్రకారం వంటలు చేసిపెట్టాలని ఆదేశించారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ తిరుపతన్న పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఎంఈఓ రామకృష్ణ, హెచ్‌ఎం హేమలత, ఉపాధ్యాయులు ఉన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఈఓ



పాఠశాల రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ

కేటీదొడ్డి: క్రమం తప్పకుండా విద్యార్థులు పాఠశాలకు రావాలని మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని రంగాపురం, మల్లాపురం, మైలగడ్డ, పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భోజనం ఎలాఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడారు. ప్రతి రోజు విద్యార్థులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, విద్యార్థులకు ఇచ్చిన టెక్స్‌బుక్స్ నోట్ పుస్తకాలు వర్క్‌బుక్స్ ఆన్‌లైన్ ఎఫ్‌ఏ-1 మార్క్స్ ఆన్‌లైన్ ఎంట్రీ చేయాలని సూచించారు. హాజరుపట్టికను పరిశీలించారు. వారివెంట హెచ్‌ఎం మల్లికార్జున్, వరలక్ష్మి, ఉపాధ్యాయులు ఉన్నారు.

భైరంపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన

అలంపూర్‌రూరల్: మండలంలోని భైరంపల్లిలో గురువారం బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమాన్ యూత్ భక్త బృందం ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి ఆలయంలోని అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి బొడ్రాయిని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల ప్రజలు వచ్చి ఆలయంలోని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



బొడ్రాయికి పూజలు చేస్తున్న అర్చకులు

పిల్లలకు ఆరుబయటే పాఠాలు





ఆరుబయట పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు, పెచ్చులూడుతున్న పాఠశాల గది

అలంపూర్‌రూరల్: మండలంలోని క్యాతూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరుబయటే ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. ఐదు రోజులుగా కురిసిన వర్షాలకు తరగతి గదులు పాక్షికంగా దెబ్బతినడంతో పిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఉపాధ్యాయులు సైతం విద్యార్థులకు పాఠశాల ప్రాంగణంలో పాఠాలు బోధిస్తున్నారు. తరగతి గదుల పైకప్పులు పెచ్చులు కింద పడుతుండడంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై హెచ్‌ఎం మాధవికి పలు మార్లు ఫోన్ చేసినా అందుబాటులోకి రాలేదు.

కందకం సమస్యను పరిష్కరించండి

అలంపూర్: దళితవాడలో ఉన్న కందకం సమస్యను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, కేవీపీఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి కోరారు. అలంపూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ వెంకటయ్యకు గురువారం వినతిపత్రం అందజేశారు. కందకం సమస్య పరిష్కరించడంతో పాటు వార్డు ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీలోని ఐదో వార్డులో సమస్యలపై సర్వే నిర్వహించినట్లు తెలిపారు. దళితవాడలో ఉన్న కందకం పూర్చక పోవడంతో భారీగా కురిసిన వర్షపు నీటితో నిండినట్లు తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ కార్యదర్శి నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జయన్న, నాయకులు నరసింహ, విశ్వం, నాగన్న తదితరులు ఉన్నారు.



అలంపూర్‌లో కందకం పరిశీలిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సాగు రైతుల కష్టాలు పట్టించుకోండి



అలంపూర్‌లో పీఏసీఎస్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

అలంపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కష్టాలను పట్టించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. అలంపూర్ పట్టణంలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో యూరియా కొరత తీర్చాలని కోరుతూ గురువారం పీఏసీఎస్ చైర్మన్ మోహన్‌రెడ్డికి, ఏఓ నాగార్జున్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేస్తూ కాలయాపన చేయడం మానుకోవాలన్నారు. యూరియా కోసం అన్నదాతలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి కల్పించారన్నారు. అలంపూర్ మండలంలో ఉన్న రైతులకు 200 మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జయన్న, నరసింహ, కేవీపీఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి నాగరాజు, నాగన్న, విశ్వం ఉన్నారు.

ఇళ్ల మధ్యనే మురుగు

మల్దకల్: మండలంలోని అమరవాయి గ్రామంలో ఇళ్ల మధ్యనే వర్షపు నీరు, మురుగు నిలవడంతో కాలనీవాసులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులు ప్రతిరోజు మురుగులో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాలనీలో మురుగుతో చుట్టూ పక్కల ఇళ్లలో చిన్నారులు జ్వరాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అమరవాయిలో ఇళ్ల మధ్యనే నిలిచిన మురుగు